సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 11 । మార్చి । 2024




రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి రూ.50 వేలు, గోశాలకు రూ.50 వేల చొప్పున కర్రి సుబ్బాయమ్మ (అర్తమూరు) విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి విరాళాలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి యు.నరేంద్రనాథ్ (విశాఖపట్నం) రూ. 1,11,116, పీవీ జగన్నాథగుప్తా (తుని) రూ. 1,00,100 చొప్పున విరాళాలు సమర్పించారు.



న్యూస్‌రీల్

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు



విఘ్నేశ్వరుని సన్నిధిలో కిక్కిరిసిన భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామిని మేలుకొలుపు సేవ వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 37 మంది, ప్రత్యేక దర్శనంలో 361 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 17 మంది పాల్గొని పూజలు నిర్వహించారు. నూతన వాహన పూజలు, చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిపారు. తొమ్మిది మంది భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,75,572 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

వైఎస్సార్ సీపీకి చేనేతల మద్దతు

చేనేత జిల్లా నాయకుడు పంపన రామకృష్ణ



ఎంపీ బోసుకు శాలువా కప్పుతున్న చేనేత నాయకుడు రామకృష్ణ తదితరులు

రామచంద్రపురం రూరల్: చేనేతల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీకి చేనేతల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చేనేత ఫెడరేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు పంపన రామకృష్ణ అన్నారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, దొంతంశెట్టి సత్యప్రకాశ్, ఉప్పు అర్ధనారీశ్వరబులిరాజు తదితరులతో కలసి ఆదివారపుపేటలో పర్యటిస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను కలసి మద్దతు ప్రకటించారు. చేనేతలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ గెలుపులో తామూ భాగస్వాములమవుతామని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పిల్లి సూర్యప్రకాశ్, మండపేటలో తోట త్రిమూర్తులు గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

ఏఎంసీ సభ్యుడు శ్రీనివాస్ మృతి

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రూ.2 లక్షల సాయం



శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత పెనికేరు గ్రామానికి చెందిన చవ్వాకుల శ్రీనివాస్ (48) ఆదివారం మృతి చెందారు. స్థానిక మెయిన్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న గృహానికి వాటరింగ్ (తడిపేందుకు) వెళ్లారు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని శ్రీనివాస్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడు శ్రీనివాస్ కుటుంబానికి రూ.రెండు లక్షలు ఆర్థిక సహాయం అందించి ఓదార్చారు.

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.75 అడుగులుగా నమోదైంది.

వరాల వసంతం రంజాన్

- నేడు నెలవంక దర్శనంతో ప్రారంభం కానున్న పవిత్ర మాసం
- రేపటి నుంచి ఉపవాస దీక్షలకు సిద్ధమవుతున్న ముస్లింలు

సాక్షి, రాజమహేంద్రవరం: ముస్లింలకు సకల శుభాలూ కలిగించే పవిత్ర రంజాన్ మాసం సోమవారం నెలవంక దర్శనంతో ప్రారంభం కానుంది. మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు చేపట్టేందుకు ముస్లింలు సమయాత్తమవుతున్నారు. 'అల్లాహ్.. ఈ నెలవంకను మా కోసం, శాంతిభద్రతల కోసం ఉదయింపజేయి. నీకు ప్రీతికరమైన పనులన్నీ చేసే భాగ్యాన్ని మాకు అనుగ్రహించు. ఓ నెలవంకా.. నీ దేవుడు, మా దేవుడు, అందరి దైవం అల్లాహ్ మాత్రమే' అని ప్రార్థించి నెలవంకను వీక్షిస్తారు. మసీదుల్లో ఇమామ్‌లు రంజాన్ మాసాన్ని ప్రకటిస్తారు. ఆ రాత్రి నుంచే తరావీహ్ నమాజ్ ప్రారంభమవుతుంది. మరునాడు తెల్లవారుజాము నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ ఎటువంటి ఆహారం, కనీసం నీళ్లు కూడా తాగకుండా కఠోర దీక్ష పాటిస్తారు. ఇందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. రోజా, నమాజ్, జికర్, దువాలతో గడపనున్నారు. సెహరీ, ఇఫ్తార్ విందులతో సందడి చేయనున్నారు. ఇందుకు అవసరమైన నిత్యావసరాలను విరివిగా కొనుగోలు చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా దాదాపు 400 మసీదులున్నాయి. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మసీదులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రంగురంగుల విద్యుద్దీపాలంకరణతో శోభిల్లుతున్నాయి.

ఉపవాసం ప్రత్యేకత

ఇస్లాంలో నాలుగో మూలస్తంభం ఉపవాసం. ముస్లిం సమాజం త్రికరణ శుద్ధితో ఆచరించే ఆరాధన వ్రతం ఉపవాసం. ఎదుటి వారి ఆకలి విలువను గుర్తించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. ఉపవాసాన్ని అరబీ భాషలో 'సామ్'గాను, ఉర్దూలో 'రోజా'గా పిలుస్తారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం తొమ్మిదో నెల అయిన రంజాన్‌లో ఈ ఆరాధన వ్రతాన్ని పాటిస్తారు. ఇస్లాం ధర్మశాస్త్ర పరిభాషలో సామ్ అంటే ఆగి ఉండటం. అంటే ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ తినడానికి.. తాగడానికి.. మనోవాంఛలకు దూరంగా ఉండటమని అర్థం.

వీరికి మినహాయింపు

మనిషి బలహీనతలను, వారి కష్టసుఖాలను బాగా ఎరిగిన దైవం ఉపవాసాన్ని విధిగా నిర్ణయించినప్పటికీ, కొందరికి మినహాయింపులు కూడా ఇచ్చారు. చిన్న పిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, వయో వృద్ధులు, మతిస్థిమితం లేనివారు, అశుద్ధావస్థలో ఉన్న మహిళలకు ఉపవాసం నుంచి మినహాయింపు ఉంది.

దివ్య ఖురాన్ అవతరణ మాసం

ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించి, సదా ఆచరించే దివ్య గ్రంథం ఖురాన్ ఈ మాసంలోనే అవతరించింది. ఇతర ప్రవక్తలపై ఫర్మానులు సైతం ఇదే నెలలో అవతరించాయి. అందుకే ఈ నెలకు అంతటి ప్రాధాన్యం. ఈ సమయంలో సైతాను బందీ అవుతాడని, నరక ద్వారాలు మూతపడి, స్వర్గ ద్వారాలు తెరచుకుంటాయన్నది ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

ప్రత్యేక ప్రార్థనలు

రంజాన్ మాసమంతా ముస్లింలు ఆధ్యాత్మికంగా గడుపుతారు. ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనల్లో నిమగ్నమవుతారు. రోజూ సూర్యాస్తమయం వరకూ కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తారు. దానధర్మాలు చేస్తారు. 5 పూటల నమాజ్‌తో పాటు తరావీ ప్రార్థనల్లో పాల్గొంటారు. 30 అధ్యాయాలున్న ఖురాన్‌ను నెలలోగా పఠించాలన్న ప్రవక్త ఆదేశాన్ని తప్పక పాటిస్తారు. పేదలకు సంపన్నులు జకాత్ చెల్లిస్తారు. చివరి పది రోజులూ ఇంటిని వదిలి మసీదుల్లోనే ఉంటూ దైవస్మరణ చేస్తారు. పండగకు ముందు ఫిత్రా ఇస్తారు. ఉపవాస సమయంలో జరిగిన తప్పులు, లోటుపాట్లకు ఈ ఫిత్రా పరిహారం. ఉపవాసాలు పాటించిన వారు, పాటించని వారు, చిన్నాపెద్దా అనే తారతమ్యం లేకుండా దానం చేస్తారు.

సంకల్పం


ప్రవక్త బోధించిన 'నవయతుఅన్ అసుముగజన్ లిల్లాహి తాలా మిన్ సామిరమజాన్' అనే వచనాలను పఠించి ఉపవాస వ్రతానికి ముస్లింలు శ్రీకారం చుడతారు. ఉపవాస విరమణ సమయంలో 'అల్లాహుమ్మ లకసుంతు వబిక ఆమంతు, వ అలైక తవక్కల్తు, వ ఆలారిస్కిక అఫ్తర్తు ఫతఖబ్బల్ మిన్ని' అని వచిస్తారు.

సెహరీ

ఉపవాసం (రోజా) ఉండదలచిన వారు తెల్లవారుజామున 4 గంటల సమయంలో భోజనం చేస్తారు. దీనినే సెహరీ అంటారు. సాయంత్రం వరకూ ఏ పదార్థాన్నీ తినరు. ఏదైనా కారణం వల్ల సెహరీ తీసుకోకపోయినా వ్రతాన్ని మాత్రం ఆపరు.

ఇఫ్తార్

సూర్యాస్తమయం తరువాత ఏదైనా ఆహారం తీసుకుని, ఆ రోజు దీక్షను విరమించడమే ఇఫ్తార్. ఖర్జూరాలతో ఇఫ్తార్ చేయడం ప్రవక్త సంప్రదాయం. అందుకే ముస్లింలందరూ ఖర్జూరాలతోనే ఇఫ్తార్ చేస్తారు. ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ నిష్ఠతో ఉంటారు. దీక్షను విరమించే సమయంలో ఉపవాసి దేనిని అర్థించినా అల్లాహ్ స్వీకరిస్తాడని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఉపవాసికి ఇఫ్తార్ ఇవ్వడాన్ని దైవ సేవగా భావిస్తారు. విందు ఇచ్చేవారి పాపాలను దేవుడు క్షమిస్తాడని నమ్ముతారు.



రాజమహేంద్రవరంలో రంజాన్ వేడుకలకు ముస్తాబైన రాయల్ మాస్క్ (పెద్ద మసీదు)



ఇఫ్తార్ (ఫైల్)

30 రోజులు ప్రత్యేకం

- రంజాన్ మాసంలో తొలి 10 రోజులు కారుణ్య దినాలు.
- 10 నుంచి 20 క్షమాపణ రోజులు.
- 20 నుంచి 30 వరకూ నరకాగ్ని నుంచి విముక్తి దినాలు.

తరావిహ్ నమాజ్ ప్రారంభం

రంజాన్ మాసం నెలవంక దర్శనమిచ్చినప్పటి నుంచే తరావిహ్ నమాజ్ ప్రారంభమవుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మసీదుల్లోనూ రంజాన్ మాసం ముగిసే వరకూ (మళ్లీ నెలవంక దర్శనమిచ్చేంత) ప్రతి రోజూ రాత్రి వేళ నమాజ్ కొనసాగుతుంది. ఈ నమాజులో రోజుకు ఖురాన్‌లోని కొన్ని అధ్యాయాలు చదివి వినిపిస్తారు. మాసం పూర్తయ్యేలోగా ఖురాన్ పఠనం పూర్తి చేస్తారు.

నాలుగు వాక్యాలే ప్రధానం

పవిత్ర రంజాన్ మాసంలో మహ్మద్ ప్రవక్త నాలుగు విషయాల్ని అధికంగా స్మరించాలని ఉపదేశించారు. వాటి ప్రాముఖ్యతను ధార్మిక పండితులు వివరిస్తారు. లాయిలాహ ఇల్లల్లాహ్, అస్తగ్ఫిరుల్లా, అస్అలుకజన్నత్, అవుజుబికమిన్నార్ ఎక్కువగా పఠించాలి.

ఇబాదత్‌తో పుణ్యఫలం



రంజాన్ మాసం అత్యంత పవిత్రమైంది. ఈ నెల మొత్తం ఇబాదత్‌తో (దైవ ప్రార్థన) గడపాలి. దానధర్మాలు చేయాలి. ఉపవాస దీక్షలు తప్పకుండా పాటించాలి. తద్వారా పుణ్యఫలం, అల్లాహ్ కృప పొందవచ్చు. రంజాన్ చివరి పది రోజుల్లో ఐదు తాఖ్‌రాత్‌లు వస్తాయి. అన్ని రాత్రులూ ఇబాదత్ బాగా చేయాలి. దువా చేయాలి. లైలతుల్ ఖదర్ రాత్రి చేసే ఇబాదత్ వెయ్యి రాత్రుల కంటే అధికంగా ఉంటుంది. ఈ రాత్రి దైవారాధనలో గడిపితే అత్యధిక పుణ్యఫలం సిద్ధిస్తుంది.

– హాఫిజ్ అలీ అన్సారీ రజ్వీ, ఇమామ్, ఆయేషా మసీదు, రాజమహేంద్రవరం

మసీదుల్లో ఆధ్యాత్మిక శోభ



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని మసీదులూ ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. ఉపవాస దీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ ఇప్పటికే పూర్తయ్యాయి. ఉపవాస దీక్ష పాటించే వారికి ఆయా మసీదుల్లో అన్ని సౌకర్యాలూ కల్పించారు. ఈ పవిత్ర మాసంలో అత్యధిక సమయం ప్రార్థనలకే కేటాయించాలి. ఎక్కువగా దువా చేయడంతో దేవుని కృప పొందే అవకాశం ఉంది.

– మొహమ్మద్ ఆరీఫ్, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్

అ'టెన్'షన్

- పదో తరగతి పరీక్షలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్
- 21,113 మంది రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు

రాయవరం: మరో వారం రోజుల్లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులతో పాటు విద్యాశాఖాధికారులు అప్రమత్తమయ్యారు. పదవ తరగతి ఫలితాలు, నిర్వహణపైనే జిల్లా విద్యాశాఖాధికారుల పనితీరు ఆధారపడి ఉంటుంది. అందుకే జిల్లా విద్యాశాఖ మెరుగైన ఉత్తీర్ణత సాధించడంతో పాటుగా, పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. మరో పక్క ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

112 పరీక్ష కేంద్రాలు..

ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న 'బి' కేటగిరి పరీక్షా కేంద్రాలు 61, పోలీస్‌స్టేషన్‌కు ఎనిమిది కిలోమీటర్లు పైబడి ఉన్న 'సి' కేటగిరి పరీక్షా కేంద్రాలు 51 ఉన్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు-6, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు-4, జెడ్పీ ఉన్నత పాఠశాలలు-85, సాంఘిక సంక్షేమ ఉన్నత పాఠశాలలు-2, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు-3, ఎయిడెడ్ పాఠశాల-1, అన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ విద్యార్థులు 18,992 మంది, ప్రైవేట్‌గా 2,121 మంది హాజరు కానున్నారు. 9,567 మంది బాలురు, 9,425 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. ప్రైవేట్‌గా 1,304 మంది బాలురు, 817 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు డిపార్ట్‌మెంట్ అధికారుల నియామకం ఇప్పటికే చేపట్టినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ నక్కా సురేష్ తెలిపారు.



ఓఎంఆర్ షీట్లను పరీక్షా కేంద్రాల సీఎస్, డీవోలకు అందజేస్తున్న అధికారులు

జిల్లా కేంద్రానికి చేరుకున్న ప్రశ్నపత్రాలు

శని, ఆదివారాల్లో రెండు విడతలుగా ఏడు రోజుల పరీక్షలకు సంబంధించిన పేపర్లు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. తొలి విడత పేపర్లను పరీక్షా కేంద్రాల దగ్గర్లో ఉన్న పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సోమవారం మలి విడత పేపర్ల తరలిస్తారు. కొద్ది రోజుల క్రితం జిల్లా కేంద్రానికి ఓఎంఆర్ షీట్లు చేరుకున్నాయి. వాటిని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు అందజేశారు. సీఎస్, డీవోలకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్విజిలేటర్ల నియామకంలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఎన్నికల్లో సాంకేతిక సైన్యం

- ఐటీ సేవల విస్తృత వినియోగం
- ఎన్నికల అధికారులకు శిక్షణ

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. అక్రమాల కట్టడి, ఫిర్యాదుల స్వీకరణ, అనుమతుల జారీకి ఈసారి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఆధారిత సాంకేతిక సేవలను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టింది. సువిధ, సీ–విజిల్, అబ్జర్వర్ పోర్టల్, పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చింది. ఫిర్యాదులపై తక్షణం స్పందించేలా అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తోంది. ఓటర్లు కూడా దీనిని సమర్థంగా వినియోగించుకునేలా ముందస్తు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా జిల్లాలోని 19 మంది సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. వీరు ఏయే పనులు నిర్వహించాల్సి ఉంటుందనే అంశాలను ఇప్పటికే స్పష్టం చేశారు. వీరు ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమితులైన అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, నోడల్, అకౌంటింగ్ బృందం, ఐటీ, వెబ్ కాస్టింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియ, ఆ ఓట్ల లెక్కింపు, వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోవడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఐటీ ఆధారిత సేవలను ఈసారి మరింత విస్తృతంగా వినియోగించుకోనున్నారు.



ప్రచార అనుమతులకు 'సువిధ'

ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు తాము నిర్వహించుకునే సభలు, సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాలకు అధికార యంత్రాంగం నుంచి ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన అనుమతులను సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తారు. వీటి కోసం అభ్యర్థులు, వారి అనుచరులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదు.

ప్రలోభాల కట్టడికి 'సీ–విజిల్'

ఎన్నికల్లో నగదు, మద్యం పంపిణీ, ఓటర్లను భయపెట్టి పోలింగ్ కేంద్రాలకు రాకుండా చేయడం, ఇతర ప్రలోభాలకు గురి చేసి లబ్ధి పొందాలని చూడటం వంటి అక్రమాలను కట్టడి చేసేందుకు సీ–విజిల్ యాప్ అందుబాటులోకి తెచ్చారు. అక్రమాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు, లొకేషన్‌ను ఈ యాప్‌లో పొందుపరిస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసే అధికారులు తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశారు. ఎన్నికల షెడ్యూలు వచ్చి నాటి నుంచి దీనిని వినియోగించనున్నారు.

ఆదేశాల సత్వర అమలుకు..

ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి నుంచి వచ్చే ఆదేశాలు ఎన్నికల నిర్వహణ సిబ్బందికి వేగంగా చేరేలా అబ్జర్వర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చారు. ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఈ పోర్టల్ పని చేస్తుంది. ఓటర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చారు. తమ ఓటు ఉందా, లేదా.. ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది, ఆ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది, బూత్ లెవెల్ అధికారి ఎవరు, ఫొటో ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) సంఖ్య వంటి ఓటరుకు అవసరమైన సమస్త సమాచారాన్ని పబ్లిక్ పోర్టల్ ద్వారా తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల విధులకు సర్వసన్నద్ధం

- ఉద్యోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం
- 7న పీఓలకు తొలి దశ శిక్షణ పూర్తి
- జిల్లాకు 11,832 మంది పోలింగ్ సిబ్బంది

రాయవరం: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధమవుతోంది. ఎన్నికల్లో వివిధ దశలు, విభాగాల్లో ఉద్యోగులను కేటాయిస్తోంది. దీనికిగాను జిల్లా యంత్రాంగం ఉద్యోగ సేనను సిద్ధం చేస్తోంది. సదరు ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్‌కు అన్ని ఏర్పాట్లూ చేసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు చర్యలు తీసుకుంది. 42 అంశాలతో కూడిన వివరాలను ఆన్‌లైన్‌లో ఇప్పటికే పొందుపర్చింది.

వివరాలన్నీ నమోదు చేసి..

ఎన్నడూ లేని విధంగా ఉద్యోగుల ఓటరు గుర్తింపు కార్డులతో పాటు, బ్యాంకు ఖాతా నంబరు, ఐఎఫ్ఎస్సీ కోడ్ నమోదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ క్రమంలో ప్రతి ఉద్యోగి వివరాలను ఆయా శాఖల పర్యవేక్షకులు నమోదు చేస్తున్నారు. ఉద్యోగి పేరు, పనిచేస్తున్న సొంత శాఖ, మండలం, నియోజకవర్గం, విధుల్లో ఎప్పుడు చేరారు? ఉద్యోగ విరమణ ఎప్పుడు?, ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఎన్నాళ్ల నుంచి ఉన్నారు? ఓటు హక్కు ఏ నియోజకవర్గంలో ఉంది, తదితర వివరాలను ఆన్‌లైన్ చేశారు. ఆ వివరాల ఆధారంగా ఎన్నికల విధులు అప్పగించనున్నారు. సొంత మండలంలో కాకుండా వేరే చోట విధులు నిర్వహించాల్సి ఉంటుంది. సొంత ప్రాంతం, పనిచేస్తున్న ప్రదేశంలో బాధ్యతలు అప్పగిస్తే స్థానిక ప్రభావం ఉంటుందన్న ఉద్దేశంతో ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. వెబ్‌సైట్‌లో వివరాల నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత పోలింగ్‌కు ఒకరోజు ముందు వరకూ ఎవరికి ఎక్కడ విధులన్నది అత్యంత గోప్యంగా ఉంచుతారు. అసెంబ్లీ/ పార్లమెంట్ ఎన్నికలకు జిల్లాలో 11,832 మంది సిబ్బంది అవసరం ఉండగా, వారందరి వివరాలను ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా వడబోసి ఎన్నికల సిబ్బందిని ఎంపిక చేయనున్నారు.



ఈవీఎంల వినియోగంపై పీఓలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శిక్షణ ఇచ్చి.. జాగ్రత్తలు తెలిపి

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రిని పోలింగ్‌కు ముందు ఆయా నియోజకవర్గాలకు సరఫరా చేయనున్నారు. జిల్లాలో 1,644 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందుకు అనుగుణంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు అందించనున్నారు. కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ పరికరాలు అవసరానికి మించి పంపించనున్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి సంబంధించిన కరదీపికలు అందజేయగా, ఇప్పటికే కలెక్టరేట్‌లో మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరు, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై నోడల్ అధికారులకు శిక్షణనిచ్చారు.

మొదటి దశ పూర్తి

జిల్లాలో 1,644 పోలింగ్ బూత్‌లకు అంతే సంఖ్యలో ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. వీరికి రామచంద్రపురం, మండపేట, కొత్తపేట, ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల 7న మొదటి దశ శిక్షణ ఇచ్చారు. ప్రిసైడింగ్ అధికారులకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో మాస్టర్ ట్రైనీలు శిక్షణ అందించారు. అలాగే మహిళా ఉద్యోగులకు వారు పనిచేస్తున్న నియోజకవర్గ పరిధిలోనే విధులు అప్పగించనున్నారు. ఈ నేపథ్యంలో మండలాల వారీగా ఉద్యోగినుల మొదటి దశ శిక్షణ పూర్తి చేశారు. వీరి నియోజకవర్గంలో, వారు పనిచేస్తున్న మండలాన్ని మినహాయించి మిగిలిన మండలాల్లో విధులు అప్పగిస్తారు.

వైఎస్సార్ సీపీ గెలుపే మా ధ్యేయం

మాదిగల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



ఐక్యత చాటుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

తాళ్లరేవు: మాదిగలకు చట్టసభల్లో అత్యున్నత పదవులు ఇవ్వడంతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ విజయమే మా మాదిగల ధ్యేయమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఆదివారం తాళ్లరేవు మండలం జార్జీపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్‌లో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, విశ్రాంత వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణరాజు అధ్యక్షతన మాదిగల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఇజ్రాయిల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు నాలుగు లక్షలకు పైగా మాదిగ జనాభా ఉన్నప్పటికీ ఏ పార్టీ కనీసం గుర్తించలేదన్నారు. 2014లో మీ కోసం పాదయాత్రలో చంద్రబాబుకు మాదిగలంతా అండగా ఉండి విజయవంతం చేశామన్నారు. ఆ సందర్భంలో మాదిగలకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరగా పి.గన్నవరం కేటాయిస్తానని చెప్పి మాట తప్పారన్నారు. 2019లో జనసేన పార్టీ కూడా పి.గన్నవరం సీటు ఇస్తానని మాట ఇచ్చి మాట తప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే 2016 నుంచి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాటను నిలుపుకుని మాదిగల తరఫున తనకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టి మాదిగలపై ఆయనకున్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. ఉభయ గోదావరి జిల్లాలో సంఘీయులందరూ సీఎం జగన్‌కు రుణపడి ఉంటారన్నారు. మాదిగ జాతికి అత్యున్నత పదవి ఇచ్చి గౌరవించిన వైఎస్సార్ సీపీని మరొక్కసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇజ్రాయిల్‌ను పెట్ల సూర్యనారాయణరాజు, శాంతకుమారి దంపతులు సత్కరించారు. జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, నేతలు రాజు, ఏడుకొండలు, కన్నబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువత బాధ్యతగా ఉండాలి

రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

తాళ్లపూడి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల మేరకు యువత బాధ్యతగా పనిచేయాలని, హక్కులకు ఎక్కడ భంగం వాటిల్లినా బాధిత ప్రజల కోసం అక్కడ తానుంటానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పర్యటించారు. వేగేశ్వరపురంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. యువకులు ఆయనను ఘనంగా సన్మానించారు. విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ హక్కులకు సంబంధించి యువతకు పలు సూచనలు చేశారు. కొట్లాటలు, జూదాలు, మద్యం వంటి వాటి జోలికి వెళ్లవద్దని, బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో ఎస్సీఎస్టీలు పదవుల్లో ఉన్నప్పటికీ కింది స్థాయి నుంచి పై వరకు కూడా ఆ గౌరవాన్ని పొంద లేకపోతున్నారని అన్నారు. ఓటు హక్కు వినియోగించుకుని పాలకులుగా మారతారా? ఓటు అమ్ముకుని బానిసలుగా ఉంటారా? అని యువతను ప్రశ్నించారు. బల్లిపాడు, తాళ్ళపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర జై భీం నాయకులు బానుచందర్, యాళ్ల బాబురావు, గూడా విజయరాజు, యాళ్ల సునీల్, కరిపోతు అశోక్, కంభం శివయ్య, కావూరి భీమరాజు, ఉబా రవి, అక్కబత్తుల శ్రీను, పల్లి కుటుంబరావు, రజని సోదరులు, నవీన్, రవి, శ్రీను రామారావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

దేవరపల్లి: ఏలూరు జిల్లా కొయ్యలగూడెం నుంచి కాకినాడ పోర్టుకు వ్యాన్‌పై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం ఉదయం దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద హైవేపై పట్టుకున్నారు. వ్యాన్‌లో 12,200 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్టు అధికారులు తెలిపారు. తెల్లవారు జామున 5 గంటల సమయంలో అందిన సమాచారం మేరకు వ్యాన్‌ను తనిఖీ చేయగా, దానిలో రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించినట్టు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని గోపాలపురం మండల స్థాయి స్టాక్ పాయింట్‌కు అప్పగించి, వ్యాన్ డ్రైవర్, బియ్యానికి సంబంధించిన యజమానిపై క్రిమినల్(7ఎ) కేసు, నిత్యావసర సరకుల చట్టం(6ఎ) కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ దాడిలో సీఎస్‌డీటీలు టి.సత్యనారాయణ, దివాకర్, ప్రభాకర్, అనిల్ పాల్గొన్నారు.

బీసీ గురుకులాలు.. విద్యానిలయాలు

- ఎంజేపీఏపీ బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల
- 440 మంది విద్యార్థులకు 5వ తరగతిలో ప్రవేశాలకు అవకాశం
- దరఖాస్తుకు ఈ నెల 31 తుది గడువు



మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయం

రాయవరం: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు సమయం ఆసన్నమైంది. 2024– 25 విద్యా సంవత్సరంలో బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా ఉన్న తొమ్మిది పాఠశాలల్లో 440 మందికి ప్రవేశాలు లభించనున్నాయి. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ప్రవేశానికి ఈ నెల ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకూ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

బాలురు, బాలికలకు వేర్వేరుగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి గృహాలు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం వద్ద ఉన్న సమనస బాలుర పాఠశాలలో 80, రామచంద్రపురం బాలికల పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 80, తుని బాలుర పాఠశాలలో 40, పెద్దాపురం బాలుర పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి బాలుర గురుకుల పాఠశాలలో 40, రాజమహేంద్రవరం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 40, కొవ్వూరు బాలుర ఉన్నత పాఠశాలలో 40, గోపాలపురం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 440 సీట్లకు ఎంట్రన్స్ నిర్వహిస్తారు. కోనసీమ జిల్లా సమనస పాఠశాలలో 40 శాతం (32 సీట్లు) మత్స్యకారులకు మాత్రమే కేటాయిస్తారు.

ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నపత్రం

ఐదవ తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి సంబంధించి ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారు. గతంలో లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించగా, మూడేళ్లుగా ఎంట్రన్స్ నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. 4వ తరగతి స్థాయి పరీక్ష ఉంటుంది. ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై 50 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నపత్రం ఇస్తారు. తెలుగు-10, ఇంగ్లిషు-10, గణితం-15, సైన్స్, సోషల్ కలిపి 15 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్షా సమయం రెండు గంటలు. విద్యార్థుల సమాధానాలను ఓఎంఆర్ షీట్లో గుర్తించాల్సి ఉంటుంది. జిల్లా యూనిట్‌గా ప్రవేశాలకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులకు వారి సొంత జిల్లాలో మాత్రమే పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షా కేంద్రం వివరాలను హాల్ టిక్కెట్‌లో తెలియజేస్తారు.

జిల్లా	కన్వీనర్లు	సెల్ నంబర్లు
కోనసీమ	వైటీఎస్ రాజు	98661 95979
కాకినాడ	ఎర్నస్ట్ సీకేపీ	94901 86560
తూర్పుగోదావరి	సాయినాథ్	94402 65787

ఎంపిక విధానం ఇలా..

అర్హులైన విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరి, అభ్యర్థి కోరిన పాఠశాల ప్రాధాన్యతల ఆధారంగా ఎంపిక చేస్తారు. బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఓసీ/ఈబీసీలకు రెండు శాతం, బీసీ-ఎ 20శాతం, బీసీ-బి 28శాతం, బీసీ-సీ మూడు శాతం, బీసీ-డీ 19శాతం, బీసీ-ఈ నాలుగు శాతం సీట్లు కేటాయిస్తారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఆరు శాతం, అనాథలకు మూడు శాతం సీట్లు కేటాయిస్తారు. ఏదైనా రిజర్వేషన్ కేటగిరీలో అభ్యర్థులు లేకుంటే అటువంటి ఖాళీలను బీసీ కేటగిరి అభ్యర్థులకు కేటాయిస్తారు. సమానమైన ర్యాంక్ ఒకరి కంటే ఎక్కువ మందికి వచ్చినప్పుడు పుట్టిన తేదీ ప్రకారం అధిక వయస్సు ఉన్న వారికి ప్రాధాన్యమిస్తారు. సమానమైన ర్యాంకు వస్తే, గణితంలో పొందిన మార్కులను పరిగణలోకి తీసుకుంటారు. అప్పుడు కూడా సమానమైన ర్యాంకు వస్తే పరిసరాల విజ్ఞానంలో పొందిన మార్కులను పరిగణలోనికి తీసుకుంటారు. ప్రవేశానికి ఎంపికైన వారికి మాత్రమే కాల్ లెటర్స్, ఫోన్ ద్వారా సమాచారం ఇస్తారు. మెరిట్ లిస్టు మార్కుల ఆధారంగా మొదటి, రెండవ, మూడవ జాబితాను ఖాళీలను బట్టి ప్రకటిస్తారు.

రెసిడెన్షియల్ పాఠశాలల్లో లభించే సదుపాయాలు

ఉచిత వసతి, గురుకుల విధానంలో చదువుకునే అవకాశం. నెలకు రూ.1,400తో పౌష్టిక విలువలతో కూడిన మెనూ. నాలుగు జతల యూనిఫామ్, దుప్పటి, జంబుకాన, బూట్లు, సాక్స్, టై, బెల్ట్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను జగనన్న విద్యాకానుక ద్వారా విద్యార్థులకు అందజేస్తారు. కాస్మోటిక్ చార్జీలు బాలురకు నెలకు రూ.125 (5,6 తరగతులు) 7వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న బాలురకు నెలకు రూ.150లు చెల్లిస్తారు. బాలురకు నెలకు సెలూన్ ఖర్చుల కింద రూ.50 వంతున ఖర్చు చేస్తారు. 6,7 తరగతులు చదువుతున్న వారికి నెలకు రూ.130, 8వ తరగతి నుంచి ఆపై తరగతులు చదువుతున్న బాలికలకు నెలకు రూ.250 వంతు చెల్లిస్తారు. 5వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థి ఇంటర్మీడియెట్ వరకు గురుకుల పాఠశాలల్లోనే విద్యను అభ్యసించవచ్చు. సమీకృత పౌష్టిక ఆహారం కింద ప్రతి రోజు వేరుశనగ చిక్కి, వారానికి ఆరు రోజులు కోడిగుడ్డు, వారానికి రెండు సార్లు చికెన్ కర్రీ ఇస్తారు. విద్యార్థులకు పూర్తి స్థాయి ఇంగ్లిషు మీడియంలో బోధన చేస్తారు. క్రీడలతో పాటుగా బోధనేతర కార్యక్రమాల్లో కూడా శిక్షణ ఇస్తారు. లైబ్రరీలు, ప్రయోగశాలలు, డిజిటల్ తరగతులతో విద్యాబోధన చేస్తారు.

సీబీఎస్ఈ విధానం అమలు



గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య ఇంగ్లిషు మీడియం విద్య లభిస్తుంది. 9వ తరగతి నుంచి సీబీఎస్ఈ అమలు చేస్తున్నాం. ప్రాథమిక తరగతుల్లో మంత్ర టీమ్ పర్యవేక్షణలో ప్రాథమిక భావనలను అభివృద్ధి చేయడానికి ప్రాజెక్టు బేస్డ్ లెర్నింగ్ అమలు పరుస్తున్నాం.

– డాక్టర్ వైటీఎస్ రాజు, ప్రిన్సిపాల్, ఎంజేపీఏపీబీసీడబ్ల్యుఆర్ స్కూల్, సమనస

దరఖాస్తు చేయాలిలా..

బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థులకు 9-11 సంవత్సరాల వయసు మించి ఉండాలి. 2013 సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి 2015 ఆగస్టు 31 తేదీ మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9-13 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి. 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్యలో జన్మించి ఉండాలి. విద్యార్థులు జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందడానికి ఆ జిల్లాలోని పాఠశాలల్లో చదువుతూ ఉండాలి. రెండేళ్లుగా నిరంతరంగా (2022-23, 2023-24) చదువుతూ ఉండాలి. విద్యార్థులు సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతిలో 2023-24 విద్యా సంవత్సరంలో చదువుతూ ఉండాలి.

అభ్యర్థులు అర్హతలు పరిశీలించుకుని దరఖాస్తు చేసుకున్న తర్వాత రూ.100 చెల్లించాలి. ఫీజు చెల్లించిన వారికి నంబర్‌ను కేటాయిస్తారు. ఆ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్://ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నంబర్‌ను పరీక్ష ఫీజు చెల్లించిన వివరాలకు కేటాయించిన కాలమ్‌లో నమోదు చేయాలి.

ఈ నెల 31 తుది గడువు

విద్యార్థులు దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 31 తుది గడువు. ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించిన తర్వాత ఒక రిఫరెన్స్ నంబర్‌ను ఇస్తారు. నింపిన దరఖాస్తు నమూనా కాపీని ప్రింట్ తీసుకుని ఉంచుకోవాలి. దరఖాస్తు సమయంలో అభ్యర్థి కుల ధ్రువీకరణ, ఆదాయం, పుట్టినతేదీ, ప్రత్యేక కేటగిరి ధ్రువీకరణ, స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్ తదితర ధృవపత్రాలు ఒరిజనల్ సర్టిఫికెట్లు కౌన్సిలింగ్ సమయంలో సమర్పించవలసి ఉంటుంది. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించరాదు. పరీక్ష తేదీకి ఏడు రోజులు ముందుగా విద్యార్థి రిఫరెన్స్ నంబర్ ద్వారా హాల్ టికెట్లు దగ్గరలోని ఏదైనా ఇంటర్నెట్ సెంటర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

దరఖాస్తు నింపే సమయంలో ఈ సూచనలు పాటించాలి

- దరఖాస్తును ఆన్‌లైన్‌లో నింపడానికి ముందుగా నమూనా దరఖాస్తును పూరించాలి.
- పరీక్షా కేంద్రాన్ని దరఖాస్తుదారులు సొంత జిల్లాను మాత్రమే ఎంపిక చేయాలి.
- పాఠశాల ప్రాధాన్యతాక్రమం ఎంచుకోవడానికి ముందు పాఠశాలల పట్టిక చూసుకుని పూరించాలి. పాస్‌పోర్టు సైజ్ ఫొటోను సిద్ధం చేసుకోవాలి. దరఖాస్తు పూరించే సమయంలో జరిగే పొరపాట్లకు విద్యార్థిదే పూర్తి బాధ్యత.
- ఒకసారి దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన తర్వాత ఎటువంటి మార్పులకు తావులేదు.

కన్నుల పండువగా త్రిశూల స్నానం



త్రిశూల స్నానం చేయిస్తున్న అర్చకులు

పిఠాపురం: ప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవరోజు ఆదివారం కుక్కుటేశ్వరునికి త్రిశూలస్నానం కన్నుల పండువగా జరిగింది. భక్త జనసందోహం నడుమ శ్రీకుక్కుటేశ్వస్వామి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవార్లకు వేదమంత్రోచ్ఛరణలతో త్రిశూల స్నానం వైభవంగా నిర్వహించారు. అనంతరం కుక్కుటేశ్వరస్వామిని, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలు అలంకరించిన అర్చకులు ఊరేగింపుగా తీసుకొని వచ్చి వేదికపై అధిష్టింపచేశారు. వేదపండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో అర్చకుల యాజ్ఞీకంలో వేదమంత్రాల నడుమ స్వామి వారి త్రిశూలస్నానం నిర్వహించారు. ఆలయ ఈఓ పులినారాయణమూర్తి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు విశేష అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు తెప్పోత్సవం

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు సోమవారం కుక్కుటేశ్వరుని తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ నారాయణమూర్తి తెలిపారు. రాత్రి 8 గంటలకు స్వామివారి తెప్పోత్సవం, 10 గంటలకు శ్రీపుష్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

శివరాత్రి ఉత్సవాల్లో విషాదం

- బాణసంచా పేలి విద్యార్థిని మృతి
- త్యాజంపూడిలో విషాద ఛాయలు



పుష్ప మృతదేహం

దేవరపల్లి: శివరాత్రి ఉత్సవాల్లో సరదాగా గడపడానికి కుటుంబ సభ్యులతో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం వెళ్లిన విద్యార్థిని దాసరి పుష్ప(16) బాణసంచా పేలిన ఘటలో మృతి చెందింది. దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన దాసరి నారాయణరావు కుటుంబానికి చెందిన నలుగురు శనివారం రాత్రి 10 గంటలకు వీరంపాలెం శివరాత్రి ఉత్సవాలకు వెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాణసంచా కాల్పులు చూడడానికి జనంతో పాటు దాసరి నారాయణరావు కుటుంబ సభ్యులు వేచి ఉన్నారు. ఆ సమయంలో బాణసంచా జువ్వ బాంబు వచ్చి జనం మధ్యంలో ఉన్న విద్యార్థి దాసరి పుష్ప తలపై పడి పేలింది. ఈ పేలుడుకు పుష్ప తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్టు ఆమె చిన్నాన్న దాసరి నారాయణరావు తెలిపారు. పుష్ప దేవరపల్లి మండలం యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జెడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. పేద కుటుంబానికి చెందిన దాసరి చిట్టియ్య, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిట్టియ్య గతంలో మరణించడంతో తల్లి లక్ష్మి, పెద్ద కుమారుడు పెద్దిరాజు కూలిపని చేసి రెండవ కుమారుడు సత్తిబాబు, కుమార్తె పుష్పను చదివిస్తున్నారు. సత్తిబాబు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్నాడు. ప్రయోజకురాలని చేయాలని చదివిస్తుండగా బాణసంచా రూపంలో మృత్యువు కబళించిందని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత ఉత్సవాల నిర్వాహకులతో మాట్లాడి కుటుంబానికి నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని సూచించారు. రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వడానికి నిర్వాహకులు అంగీకరించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వలంటీర్ జ్యోతికి వుమెన్ ఐకాన్ అవార్డు


హైదారాబాద్‌లో ఎమ్మెల్సీ సురభి చేతుల మీదుగా ప్రదానం



వుమెన్ ఐకాన్ అవార్డును అందుకున్న జ్యోతి

అల్లవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదారాబాద్‌లో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మహిళా దినోత్సవంలో అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన కట్టా జ్యోతికి ఎమ్మెల్సీ సురభి వాణిదేవి జాతీయ వుమెన్ ఐకాన్ 2024 అవార్డుని అందించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, నల్గొండలోని ఓల్డేజ్ హోమ్ చేసిన సేవలకు గాను ఈ అవార్డు వరించిందని జ్యోతి తెలిపింది. 2008లో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా అవార్డుని అందుకున్నానని, 2010 క్రీడల్లో 2014 మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డులు వరించాయన్నారు. ఉభయ రాష్ట్రాల పరిధిలో జరిగిన మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహరావు కుమార్తె సురభి చేతుల మీదుగా జాతీయ స్థాయిలోవుమెన్ ఐకాన్ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని జ్యోతి తెలిపింది. అల్లవరం మండలం కొమరగిరిపట్నం-3 సచివాలయంలో క్లస్టర్-5లోని 50 కుటుంబాలకు వలంటీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాని జ్యోతి తెలిపింది. ఈ అవార్డుతో సామాజిక సేవే లక్ష్యంగా బాధ్యతగా వ్యవహరిస్తానని తెలిపింది.

రాష్ట్ర స్థాయి హాకీలో స్వర్ణం



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో విజేతగా నిలిచిన కాకినాడ జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా హాకీ పోటీలలో జిల్లా క్రీడాకారిణులు ప్రతిభను కనపరచి స్వర్ణ పతకం గెలుచుకున్నారని కోచ్ వి.రవిరాజు ఆదివారం తెలిపారు. ఫైనల్స్‌లో అనకాపల్లిపై 2-0 స్కోర్ తేడాతో విజయం సాధించారన్నారు. జట్టుకు మేనేజర్‌గా జి.దుర్గాదేవి, కోచ్‌గా పి.శేషుకుమారి, కెప్టెన్‌గా నందిని వ్యవహరించారని ఆయన తెలిపారు. క్రీడాకారిణులను డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, హాకీ సంఘ కార్యదర్శి నంబు శ్రీనివాస్ అభినందించారు.

ఐకాన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రకాశం నగర్ : రోటరీ రాజమహేంద్రవరం ఐకాన్ ఉమ్మడి జిల్లా అండర్ 14 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది. ఓఎన్‌జీసీ ఈడీ అసెట్ మేనేజర్ శంతనుదాస్ ముఖ్య అతిథిగా హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు మున్సిపల్ గ్రౌండ్, జీఎస్ఎల్ క్రికెట్ గ్రౌండ్, కొంతమూరు క్రికెట్ గ్రౌండ్, వేమగిరి క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతాయని తెలిపారు. మొత్తం పన్నెండు బాలుర జట్లు, ఒక బాలికల జట్టు పాల్గొంటున్నాయన్నారు. 13న సెమీఫైనల్, 14న ఓఎన్‌జీసీ గ్రౌండ్‌లో గ్రాండ్ ఫైనల్ జరుగుతాయన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ అధ్యక్షుడు తీగెల రాజా, సంయుక్త దాస్, టోర్నమెంట్ నిర్వాహకులు భాస్కర్ శంకర్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో సమాజానికి మేలు

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



సూరంపాలెంలో ప్రవచిస్తున్న చాగంటి

గండేపల్లి: మనకు ఎంత కష్టం వచ్చినప్పటికీ ఎదుటి వారికి మేలు జరగాలని ఆశించడమే సమాజానికి మేలు చేస్తుందని ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని సూరంపాలెంలోని సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రవచనం చేశారు. సనాతన ధర్మం గురించి వివరిస్తూ నేటి ఆధునిక యుగంలో నైతిక విలువలు నానాటికీ దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ వ్యవస్థ ద్వారానే నైతిక విలువలు పెంపొందించవచ్చని, నేను, నాది అనే అహాన్ని విడిచి మనం అనే భావనతో ఉండడం అందరికీ మేలు చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే చినబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, వైస్ ఎంపీపీ కుంచే రాజా, సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ కొట్టు శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని రథోత్సవం



రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగుతున్న

అన్నవరం: సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం ఆలయ ప్రాకారంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చి ఆ రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ప్రతిష్ఠించి ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చక స్వాములు గాడేపల్లి పవన్, శివ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఏఈఓ కృష్ణారావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య బాజా భజంత్రీల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో మూడు సార్లు ప్రదక్షిణ నిర్వహించారు. రథోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, సూపరింటెంట్‌లు కృష్ణప్రసాద్, బలువు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు. రథోత్సవంలో రథానికి, అందులో ఊరేగించే స్వామి, అమ్మవార్లను మరిన్ని పుష్పాలతో అలంకరించాలని భక్తులు కోరుతున్నారు. రథం పెద్దది కావడంతో చిన్న చిన్న పూల దండలతో చేసిన అలంకరణ సరిపోవడం లేదు.

ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకటరామిరెడ్డికి ఘన స్వాగతం

వినతిపత్రాలు అందించిన నాయకులు



పి.గన్నవరంలో వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పి.గన్నవరం: ప్రభుత్వ ఉద్యోగులకు అండగా నిలిచిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం పి.గన్నవరంలో ఉద్యోగులు నిర్వహించిన ర్యాలీకి విచ్చేసిన ఏపీ సచివాలయం ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డికి స్థానిక మూడు రోడ్ల సెంటర్లో ఘన స్వాగతం పలికారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు తరలివచ్చారు. పలువురు వెంకటరామిరెడ్డిని దుశ్శాలువాలతో సత్కరించారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగ సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మూడు రోడ్ల సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. లక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేశారు. మూడు రోడ్ల సెంటర్ నుంచి దుర్గమ్మ ఆలయం వరకూ జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు 'థ్యాంక్యూ సీఎం సర్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏపీజీఈఎఫ్ రాష్ట్ర వైస్ చైర్మన్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి అరవపాల్, జీడబ్ల్యూఎఫ్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకమరావు, రీజనల్ కోఆర్డినేటర్ దారపురెడ్డి తాతాజీ, రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు దివాకర్ పాల్గొన్నారు.

61 మద్యం బాటిళ్ల స్వాధీనం

- గోవా నుంచి కాకినాడ తరలిస్తుండగా పట్టివేత
- ఏడుగురిపై కేసు నమోదు



పట్టుబడిన మద్యం బాటిల్స్‌తో సీఐ రమణ, సిబ్బంది

సబ్బవరం: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద గోవా నుంచి తీసుకొస్తున్న 61 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను సబ్బవరం పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ పిన్నంటి రమణ సిబ్బందితో కలిసి టోల్ గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారులో మద్యం పట్టుబడింది. పట్టుబడిన మద్యం బాటిళ్లలో పెద్దవి 20, చిన్నవి 41 ఉన్నాయి. వీటి విలువ రూ.30వేల వరకు ఉంటుంది. వీరంతా గోవా నుంచి విమానంలో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టులో దిగారు. సబ్బవరం జాతీయ రహదారి మీదుగా కాకినాడ వెళ్తున్నారు. మద్యం తరలిస్తున్న డ్రైవర్‌తో పాటు కాకినాడకు చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. కారును సీజ్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్టు

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెం రోడ్డులో పోలీసుల తనిఖీలలో ముగ్గురు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 39 రాగి కట్టలు, 20 లీటర్ల సారా, రెండు మోటారు సైకిళ్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు అందించిన వివరాల ప్రకారం కొంతకాలంగా జగ్గంపేట విద్యుత్ డివిజన్ పరిధిలోని అనేక మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. దీనిపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో గుర్రంపాలెం, బలభద్రపురం రోడ్డులో ఆదివారం పోలీసులు తనిఖీ చేపట్టారు. ఇదే సమయంలో రెండు మోటారు సైకిళ్లపై వస్తున్న నలుగురిని అనుమానంతో అదుపులోకి తీసుకుని పరిశీలించగా వారి వద్ద 39 రాగికట్టలు, 20లీటర్ల సారా లభ్యం అయినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న డేగల శ్రీను, ఆసనాల రాముడు, డేగల రాజు వీరంతా ఏలేశ్వరం గ్రామానికి చెందిన వారని వీరిపై గతంలో వివిధ పోలీసు స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల కేసులు 13 వున్నాయని తెలిపారు. వీరిని అరెస్టు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 15రోజులు రిమాండ్ విధించిందని చెప్పారు. ఈ కేసును ఛేదించడంలో చొరవ చూపిన పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్సై నాగార్జునరాజును ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824357]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ మీరు ఉన్నచోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్‌టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. ఫోన్ : 99595 43389 [V- 823751]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K. Ph: 9160900024/9640400073 [HA-1320]

■ హస్పటల్స్ కాదు VIP ఇండ్లలో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: 7995365999. [HA-1334]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233878]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.